ప్రతి ఒక్కరి ఆరోగ్యమే లక్ష్యం

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పెదకాకాని: ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండటమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పెదకాకానిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాల స్టాల్‌ను పరిశీలించారు.

ఈ శిబిరం ద్వారా 305 మందికి వైద్యసేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరం ఏర్పాట్లను వెనిగండ్ల పీహెచ్‌సీ మల్టీ పర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ గజ్జల శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ రామాంజిరెడ్డి, డాక్టర్ పి.ప్రవీణదీప్తి, డాక్టర్ అనూష, డాక్టర్ భవిష్యలు వైద్యసేవలు అందించారు. పెదకాకాని జిల్లా పరిషత్ పాఠశాలలో హెల్ప్‌డెస్క్, రిజిస్ట్రేషన్ డెస్క్, డాక్టర్ రూము, వైద్య పరీక్షలు, మందులు ఇవ్వడం వంటి ప్రత్యేక డెస్కులు ఏర్పాటు చేయడం జరిగిందని డాక్టర్ రామాంజిరెడ్డి వివరించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎ.రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, గ్రామ సర్పంచి గోళ్ళ స్వరూపరాణి, ఎంపీటీసీ సభ్యులు షేక్ షహనాజ్, షేక్ జాకీర్‌హుస్సేన్, డాక్టర్లు రామాంజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చాగంటి మురళీమోహన్‌రెడ్డి, బందెల ఉదయ్‌శంకర్, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లోని పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు

గొడవర్రు(చేబ్రోలు): గ్రామాల్లోని పేద ప్రజలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో అందిస్తున్నట్లు చేబ్రోలు తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ అన్నారు. చేబ్రోలు మండలం గొడవర్రు గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. గ్రామంలోని మహిళలు, వృద్ధులు, వ్యాధి గ్రస్థులు, చిన్నారులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు వైద్య సేవలు పొందారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో స్పెషలిస్ట్ వైద్యులచే రోగులకు పరీక్షలు చేసి మెరుగైన వైద్య సేవలు అందించుతారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజానీకం దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నేత్ర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో బి.బాబురావు, జీసీఎస్ కన్వీనర్, డీసీఎంఎస్ డైరక్టర్ కుర్రా పాములు తదితరులు పాల్గొన్నారు.



గొడవర్రులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో గ్రామస్తులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



గొడవర్రులో వృద్ధులకు వైద్య సేవలు అందజేస్తున్న వేజండ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి



వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య తదితరులు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

నేడు వెనిగండ్లలో జగనన్న ఆరోగ్య సురక్ష

పెదకాకాని: ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం చేకూరాలనే ఆశయంతో ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యాక్రమం శనివారం వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో జరుగుతుందని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అన్నారు. ఈ వైద్య శిబిరం ద్వారా ఆరోగ్య సమస్యలు ఉన్నవారందరూ వైద్యసేవలు పొందే విధంగా గత 15 రోజుల నుంచి ఇంటింటి సర్వే నిర్వహించి గుర్తించడం జరిగింది. వైద్యనిపుణుల పర్యవేక్షణలో జరిగే ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కోరారు. ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయడం జరుగుతుందని, అలాగే కంటి పరీక్షలు కూడా చేయడం జరుగుతుందని తెలియజేశారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

పెదనందిపాడు: ప్రజలందరికి మంచి ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి విశేష స్పందన లభిస్తోందని డిప్యూటీ తహసీల్దార్ శాంతి లక్ష్మీ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నాగులపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. శిబిరంలో సుమారు 433 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని వినియోగించుకోవాలని ప్రజలకు అవసరమైన అన్ని పరీక్షలు, 135 రకాల మందులను ఉచితంగా పంపిణీ చేస్తారని ఆమె తెలియజేశారు. ఈ శిబిరంలో ఎంఈవో జాకబ్, పీఎస్ నాగయ్య, వైద్యాధికారులు విజయరత్న కుమార్, మేరి యానిక, వైద్య ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజులు నీటి సరఫరాలో అంతరాయం



పైప్‌లైను పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అహ్మద్

పొన్నూరు: పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలు పంపుహౌస్‌లో మెయిన్ పైప్‌లైనుకు ఏర్పడిన లీకు మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు వార్డులలో 07, 08 తేదీలలో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్ తెలిపారు. 1,2,3,16,17,18,19,29,30,31 వార్డులతో పాటు నిడుబ్రోలులో నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని అన్నారు. యథావిధిగా సోమవారం నుంచి నీటి సరఫరా జరుగనుందని తెలిపారు.

రేపు నల్లపాడు అగస్త్యేశ్వరాలయంలో గుడి బడి

గుంటూరు రూరల్: నల్లపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ అగస్త్యేశ్వరాలయంలో ఈనెల 8వ తేదీన గుడి బడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు పవన్‌కుమార్ శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మన ప్రాంతంలో ఉన్న ఆధ్యాత్మిక కేంద్రాలు, ఆలయాలను శుభ్రం చేసుకోవటం మన బాధ్యతని గురువులు తెలిపారన్నారు. కార్యక్రమంలో భాగంగా బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ ఆధ్వర్యంలో నల్లపాడు గ్రామంలోని శ్రీ గంగాపార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేస్తున్న ఈ కార్యక్రమం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతుందని ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. శ్రీ ప్రణవ పీఠ శిష్యబృందం తదితరులు పాల్గొంటారని తెలిపారు.

క్లుప్తంగా

15 నుంచి శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

పొన్నూరు: పొన్నూరు బ్రాహ్మణ బజారులోని శ్రీ శంకరాచార్య సన్నిధి గాయత్రీ మందిరంలో ఈ నెల 15వ తేదీ నుంచి 24 వరకు శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు బ్రాహ్మణ మహాసభ అధ్యక్షులు పులిపాక వెంకట సత్యసాయి వరప్రసాద్ శర్మ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 15న ఉదయం కలశ స్థాపన, ప్రతిరోజు ఉదయం అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చనలు, మంత్రపుష్ప గోష్టి జరుగుతాయన్నారు. 20న సరస్వతీ పూజ, 22న దుర్గాష్టమి, 23న మహర్నవమి, 24న విజయదశమి, సాయంత్రం 6 గంటలకు శమీ పూజ నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు హైస్కూలు ప్లస్‌లో కెమిస్ట్రీ పోస్టు భర్తీకి చర్యలు

గుంటూరు ఎడ్యుకేషన్: కాకుమాను మండలం చినలింగాయపాలెంలోని జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన హైస్కూల్ ప్లస్ విభాగంలో కెమిస్ట్రీ పోస్టును భర్తీ చేసేందుకు శనివారం అర్హత గల స్కూల్ అసిస్టెంట్లు గుంటూరు డీఈవో కార్యాలయంలో హాజరుకావాలని డీఈవో పి.శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీసు రిజిస్టర్‌తో శనివారం ఉదయం 11 గంటలకు హాజరుకావాలని ఆమె సూచించారు.

నకిలీ డాక్యుమెంట్‌లు తయారు చేసిన వ్యక్తిపై కేసు

గుంటూరు రూరల్: తనకు చెందని భూమి తనదని నకిలీ డాక్యుమెంట్స్ తయారు చేసిన నిందితులను నల్లపాడు పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన శుక్రవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం అమరావతి రోడ్డు భారత్‌పేటకు చెందిన ఇజ్రాయిల్ అనే వ్యక్తికి చెందిన భూమి తనదని నకిలీ డాక్యుమెంట్‌లు తయారు చేసి బోడపాటి రాంబాబు, నండూరి దేవయ్య తదితరులు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించి కేసు నమోదు చేసి అరెస్ట్ చేయటం జరిగిందన్నారు.

చలపతి అధ్యాపకుడికి డాక్టరేట్



గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరికి ఉన్నత స్థానాలను అధిరోహించేందుకు తమ కళాశాల ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చలపతి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం లాం నందున్న కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకుడు పడవల వెంకట నరేంద్రకుమార్‌కు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసిందన్నారు. ఆచార్య సీహెచ్ చెంగయ్య పర్యవేక్షణలో ఇన్వెస్టిగేషన్స్ ఆన్ రెడక్షన్ ఆఫ్ జనరేషన్ కాస్ట్ బై ఇంప్రూవింగ్ బాయిలర్ ఎఫిషియన్స్ ఆఫ్ మల్టీ కెపాసిటీ థర్మల్ పవర్ స్టేషన్స్ యూజింగ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నిక్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన అధ్యాపకుడిని చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, సెక్రటరీ కరస్పాండెంట్ వై సుజిత్ కుమార్ తదితరులు అభినందించారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్



గుంటూరు రూరల్: అక్రమంగా మద్యంను విక్రయిస్తున్న మహిళను నల్లపాడు పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ జత్యానాయక్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో చిల్లరకొట్టు నిర్వహిస్తూ అక్రమంగా మద్యం విక్రయాలకు పాల్పడుతున్నారని స్పెషల్ బ్రాంచ్ పోలీసుల సమాచారం మేరకు దాడిచేయగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బురదగుంట రత్నకుమారిని అదుపులోకి తీసుకుని ఆమె వద్ద బీరువాలో దాచిన 21 క్వార్టర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకోవటం జరిగిందన్నారు. నిందితురాలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వీవీఐటీలో ఎక్సోషియా 2023



టాటా ఎలక్ట్రిక్ కంపెనీ క్రిష్ణారావును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో 5, 6 తేదీలలో రెండు రోజుల పాటు సాంకేతిక సదస్సు ఎక్సోషియా 2023 వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా మాజీ ప్రాజెక్ట్ మేనేజర్, టాటా ఎలక్ట్రిక్ కంపెనీ ఎస్ఎల్‌వీ క్రిష్ణారావు హాజరయ్యారు. నాలుగు అంశాలలో నిర్వహించిన సాంకేతిక పోటీలలో 740 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఫ్యూజన్ విజన్, కాంపోనెస్ట్ క్యావర్, బ్లెండ్ నర్ప్యూట్స్, ఆప్టిక్ మిస్టరీ అంశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. సాంకేతిక పోటీలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించారు. క్రిష్ణారావు మాట్లాడుతూ కోర్‌బ్రాంచ్‌లకు ఎప్పటికీ ప్రాముఖ్యత ఉంటుందని అన్నారు. విద్యార్థులలో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించి నూతన ఆవిష్కరణల వైపు ఆలోచనలు మలిచేందుకు ఇటువంటి కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు. సాంకేతిక రంగంలో మార్పులను విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి, డీన్ అడకమిక్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ అడ్మిన్ డాక్టర్ ఎన్ కుమారస్వామి, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఏవీ నరేష్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలలో వేజండ్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థినుల ప్రతిభ



హెచ్‌ఎం విజయశ్రీ, పీఈటీ వెంకటేశ్వరరావులతో విద్యార్థినులు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-17 స్కూల్ గేమ్స్ వాలీబాల్ పోటీలలో స్థానిక వేజండ్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పీఈటీ వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. బాల బాలికల వాలీబాల్ జట్టు ఎంపికలలో వేజండ్లకు చెందిన ఐదుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. మట్టుపల్లి సుమశ్రీ, షేక్ సోనీ, బింగినపల్లి మనీష, సీహెచ్ దుర్గా, ప్రసన్నలు రాష్ట్ర స్థాయిలో జరిగే వాలీబాల్ పోటీలకు జిల్లా జట్టు నుంచి పాల్గొంటారు. ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు కడప జిల్లా మైదుకూరులో జరిగే పోటీలలో వీరు పాల్గొంటారు. హెచ్‌ఎం విజయశ్రీ, పీఈటీ వెంకటేశ్వరరావు, స్థానిక పెద్దలు తదితరులు అభినందించారు.

అమరావతి రోడ్డులో ర్యాలీ


బీసీ కులగణన చేసిన బిహార్ నేతలకు పాలాభిషేకం



అమరావతిరోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ సంఘాల నాయకులు

గుంటూరు రూరల్: విజయవంతంగా బీసీల కులగణన పూర్తి చేసిన బిహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ చిత్రపటాలకు బీపీ మండల్ కమిటీ నేతలు శుక్రవారం పాలాభిషేకం చేశారు. అమరావతిరోడ్డులోని ఇన్నర్ రింగ్‌రోడ్డులోగల బీపీ మండల్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మద్దతు ర్యాలీలో బీపీ మండల్ విగ్రహ కమిటీ సభ్యుడు డాక్టర్ ఆలా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీసీ గణన జరిగితీరాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా 50 శాతానికిపైగా ఉన్న బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ అవకాశాలు కల్పించకుండా రాజకీయ పార్టీలు అన్యాయం చేస్తున్నారన్నారు. ప్రధాని నరేంద్రమోదీకి బీసీ కుల గణన చేపట్టాలని విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. డాక్టర్ శేషయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో కూడా బీసీ కులగణన చేపట్టి బీసీలకు తగిన న్యాయం చేయాలని కోరారు. అనంతరం బీసీ కులగణనకు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు పూర్ణయ్య, టి.నరసింహారావు, బి.సాంబశివరావు, టి కేశవ, డాక్టర్ శివకుమార్, ఓర్సు ప్రేమ్‌రాజ్, వాసు, నీలాంబరం, కె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతి



తెనాలి రూరల్: చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న గుర్తు తెలియని మహిళ ఈ నెల 2న తెనాలి ఆర్టీసీ బస్టాండ్‌లోని విజయవాడ్ బుకింగ్ కౌంటర్ వద్ద అపస్మారకస్థితిలో ఉండడాన్ని ప్రయాణికులు గమనించారు. 108 అంబులెన్సుకు సమాచారమిచ్చి తెనాలి జిల్లా వైద్యశాలకు పంపారు. మెరుగైన చికిత్స కోసం వైద్యులు గుంటూరు పంపగా, అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే

నంబూరులో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

పెదకాకాని: రాష్ట్రంలో పారదర్శకంగా అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అన్నారు. మండలంలోని నంబూరు వరలక్ష్మీ కళ్యాణమండపంలో శుక్రవారం రాత్రి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే అనే అంశంపై కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు మండల పార్టీ అధ్యక్షుడు చాగంటి మురళీమోహన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర అధికార ప్రతినిధి, స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత విద్య, వైద్యం,వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన పథకాలను పార్టీలకు, వర్గాలకు, మతాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అందజేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రాష్ట్రానికి తప్పక అవసరమన్నారు. కోవిడ్ 19 సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం, వైద్య సేవలు అందించిన తీరు ప్రశంసనీయమన్నారు. గడచిన నాలుగేళ్ళలో ప్రభుత్వం 6 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే, టీడీపీ 600 అమలు కాని హామీలు ఇచ్చి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్ని మనబడి నాడు నేడు పేరుతో 56 వేల కోట్ల రూపాయలతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. పొన్నూరు నియోజకవర్గంలో 1600 కోట్ల రూపాయలతో నాలుగున్నర ఏళ్ళలోనే అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. నూటికి 75 కుటుంబాలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధి పొందుతున్నాయని చెప్పారు. సచివాలయ కన్వీనర్లు, గ్రామ, వార్డు కన్వీనర్లు, గృహ సారథులు ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలను తీసుకువెళ్ళేందుకు సిద్ధం కావాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కామినేని శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, సర్పంచులు నంబూరు జ్యోతి(నంబూరు), గోళ్ళ స్వరూపరాణి(పెదకాకాని), పిట్టు శివకృష్ణారెడ్డి(అగతవరప్పాడు), ఎంపీటీసీ సభ్యులు షేక్ అబ్దుల్ లతీఫ్, దాసరి నాగేశ్వరరావు, షేక్ జాకీర్‌హుస్సేన్, షేక్ షహనాజ్, శివాలయం చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నల అవినాష్‌రెడ్డి, పీఎసీఎస్ చైర్‌పర్సన్ భీమవరపు కోటిరెడ్డి, మందాళ శివారెడ్డి, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుబాని, షేక్ దండిబాబు, జొన్నల కరుణాకరరెడ్డి, జొన్నల శేషిరెడ్డి, బందెల ఉదయ్‌శంకర్, బొంతు శివారెడ్డి, గోళ్ల జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీలో యువకునికి బంగారు పతకం



హరీష్

కాకుమాను: మండల కేంద్రం కాకుమానుకు చెందిన బీటెక్ విద్యార్థి ఈవూరి హరీష్ 2023వ సంవత్సరంలో బీటెక్‌లో అత్యంత ప్రతిభ కనబరచి అధిక మార్కులు సాధించడంతో బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నాడు. శుక్రవారం వారణాసిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ బనారస్ హిందూ యూనివర్సిటీ(వారణాసి) ఆధ్వర్యంలో నిర్వహించిన 12వ స్నాతకోత్సవ వేడుకలలో భాగంగా హరీష్‌కు డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ చైర్మన్ సమీర్ వి కవత్ చేతుల మీదుగా హరీష్ బంగారు పతకాన్ని అందుకున్నట్లు హరీష్ తండ్రి శ్రీనివాసరావు తెలిపారు. గతంలో కూడా హరీష్ 2022-23లో ఐఐటీలో అత్యధిక మార్కులు సాధించడంతో పాటు(9.84), బీటెక్ ఫైనల్ ఇయర్‌లో కూడా టాపర్‌గా నిలిచి మొత్తం 6 బంగారు పతకాలు, ఒక వెండి పతకాన్ని సాధించాడు. పదవ తరగతి నుంచి అతను అన్నింటిలో ప్రథమస్థానంలో నిలిచేవాడని శ్రీనివాసరావు తెలిపారు. ప్రస్తుతం హరీష్ హైదరాబాద్‌లోని మైక్రోసాఫ్ట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. హరీష్ తండ్రి శ్రీనివాసరావు మండలంలోని పెద్దివారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థికి బంగారు పతకం రావడం పట్ల ఎంఈఓ కేఎఫ్.కెనడీ, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.